క్లుప్తంగా

డ్రై ఫిష్ ప్లాట్‌ఫారాల నిర్మాణానికి స్థల పరిశీలన


గ్రామస్తులతో కలసి స్థల పరిశీలన చేస్తున్న మురళి,రేవతి

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు అప్పికొండలో డ్రై ఫిష్ ప్లాట్‌ఫారాల నిర్మాణంతో పాటు మల్టీపర్పస్ సైక్లోన్ రిలీఫ్ సెంటర్ నిర్మించనున్నామని ఎఫ్‌డీవో మురళి, సాగర్ మిత్ర రేవతి తెలిపారు. వీటి నిర్మాణానికి అనువుగా ఉండే స్థలాలను పరిశీలించారు. అప్పికొండలో శుక్రవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు షణ్ముఖ శివకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో చక్కని ఆరోగ్యం


పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న లీలారాణి

అగనంపూడి: పిల్లలు సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని లీ హెల్త్ డొమైన్ డైరెక్టర్ ఆళ్ల లీలారాణి అన్నారు. శారీరక శ్రమ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను కూడా వారికి వివరించాలని సూచించారు. దువ్వాడ సెక్టార్–2లోని పాఠశాలలో పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోషకాహార లోపం వల్ల పిల్లల ఎదుగుదల, ఆరోగ్య సమస్యలు వివరించారు. కార్యక్రమంలో లీ హెల్త్ డొమైన్ సంస్థ న్యూట్రిషనిస్ట్ లావణ్య, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి మూలమంత్ర హోమం


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్‌బీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శుక్రవారం విశేష పూజలు చేశారు. అమావాస్య, మహాలక్ష్మి అమ్మవారి జన్మనక్షత్రం అయిన ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం అమ్మవారి మూలమంత్ర హోమం నిర్వహించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు విశ్వకర్మ జయంతి వేడుకలు

ఉక్కునగరం: విశ్వకర్మ జయంతి వేడుకలను ఉక్కునగరం అంబేడ్కర్ కళాక్షేత్రం పక్కన ఉన్న విశ్వకర్మ ఆలయంలో ఆదివారం నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు హాజరవుతారని విశ్వకర్మ పూజా కమిటీ ప్రతినిధులు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

అమృతవనానికి మట్టి సేకరణ

గాజువాక : ఢిల్లీలో అమృతవనం నిర్మాణం కోసం బీజేపీ నాయకులు గాజువాకలో ప్రజల నుంచి మట్టిని సేకరించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక పాతకర్ణవానిపాలెంలో ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి మట్టి సేకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు గాజువాకలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈ ప్రాంతంలో వివిధ కళాశాలల నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యం సీఎం లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ నాయకులు వెల్లడి
- 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే ప్రారంభం


72వ వార్డులో సర్వే నిర్వహిస్తున్న నాయకులు, సిబ్బంది

గాజువాక : అందరికీ ఆరోగ్యం అందాలనే ఉద్దేశంతో మన ముఖ్యమంత్రి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వాసు అన్నారు. ప్రజలంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను 72వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి వాసు శుక్రవారం ప్రారంభించారు. శ్రీకృష్ణదేవరాయనగర్, అఫీషియల్ కాలనీ–2, అఫీషియల్ కాలనీ–3 సచివాలయాల పరిధిలో నివాసులను కలిసి జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించడంతో పాటు వారి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య పథకాలను వారికి వివరించి, వాటిని వినియోగించుకునే విధానాన్ని వివరించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈ యాప్ ద్వారా మెరుగైన వైద్యం పొందడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, వాసవి నాయుడు, ఇందిరాదేవి, మధు, హేమలత, ధనలక్ష్మి, విజయ, ఆదిలక్ష్మి, నాగమణి, కాలనీ పెద్దలు, సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

మహాత్ముని విగ్రహం ఏర్పాటుకు వినతి


తిప్పల దేవన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జాగరపు శ్రీను

పెదగంట్యాడ: జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గాజువాక నూతన డివైడర్ వద్ద అనువైన స్థలాన్ని గుర్తించి అనుమతులు మంజూరు చేయించాలని కోరుతూ బీసీ సెల్ నాయకుడు జాగరపు శ్రీను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాగరపు శ్రీను మాట్లాడుతూ గతంలో గాజువాకలో అనుమతులు లేని కారణంగా జీవీఎంసీ అధికారులు ఆ విగ్రహాన్ని తొలగించి తమ కార్యాలయానికి తరలించారన్నారు. ఆ విగ్రహాన్ని ఇప్పించాలని ఐదేళ్ల నుంచి కోరడంతో ఇటీవలే అధికారులు స్పందించి విగ్రహాన్ని వెనక్కి ఇచ్చేసినట్లు చెప్పారు. దీంతో దళ్లివానిపాలెం జంక్షన్ వద్ద ఆ విగ్రహాన్ని ఉంచామని చెప్పారు. గాజువాకలో మహాత్ముని విగ్రహం ఏర్పాటుకు అనుమతులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో గంగులూరి రోజారాణి, శ్రీనివాసరెడ్డి, తోకాడ రాము, సురేష్ రెడ్డి, మొల్లి శ్రీను, జగదీష్ పాల్గొన్నారు.

త్రిశక్తి దేవాలయంలో మణిద్వీపవర్ణనార్చన


ఉక్కు త్రిశక్తి దేవాలయంలో కలశ పూజలో పాల్గొన్న మహిళలు

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి, శ్రీ మహాదుర్గ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో ఉదయం మణిద్వీప వర్ణనార్చన (కలశ పూజ) చేశారు. మహిళలు తొమ్మిదిసార్లు మణిద్వీప వర్ణన పఠించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ


బైక్ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం నిర్వహించనున్న బైక్ యాత్రను విజయవంతం చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 1050 కిలోమీటర్లు బైక్ యాత్ర చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో శుక్రవారం ఎల్‌ఎంఎం పార్కులో యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అయోధ్యరామ్ మాట్లాడుతూ పోరాటాన్ని ప్రజాపోరాటంగా నిర్మించాలన్న ఆశయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రజలను చైతన్యం చేయడం కోసం ఈ యాత్ర చేపట్టారన్నారు. నగరంలోని జీవీఎంసీ శిబిరం వద్ద ప్రారంభమైన యాత్ర 29న స్టీల్ ప్లాంట్ శిబిరం వద్ద ముగుస్తుందన్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ ఉద్యమాలతోనే ప్లాంట్‌ను రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

ఉక్కునగరం: స్థానిక అరబిందో ఐడియల్ హైస్కూల్ విద్యార్థులకు చిత్రలేఖనంలో బహుమతులు లభించాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విజేతలను కరస్పాండెంట్ వి.రామారావు, కో–ఆర్డినేటర్ టి.ఎల్లేశ్వరరావు అభినందించారు.

ఐక్య పోరాటాలతోనే ఉక్కు పరిరక్షణ


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు కార్మికులు చేస్తున్న పోరాటం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 946వ రోజు, శుక్రవారం సంస్థకు చెందిన సీవో, సీసీపీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. వేలమంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను కాపాడుకునేందుకు ప్రజలందరూ ఆందోళన చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఐక్య పోరాటాలతోనే ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకోగలమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషపై అవగాహన అవసరం


చేనేత చీరల గురించి హిందీలో వివరిస్తున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: హిందీ భాషపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. హిందీ దివస్‌ను పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ వేషధారణల్లో అలరించారు. చేనేత మగ్గాలపై నేసిన చీరల గురించి విద్యార్థులు హిందీలో వివరించి ఆకట్టుకున్నారు. స్వచ్ఛ భారత్ గురించి హిందీలో తెలియజేశారు. హిందీ ఉపాధ్యాయిని జి.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, దేముళ్లు, రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల విజేతలకు అభినందనలు


విజేతలతో హెచ్‌ఎం కాంతం, పీడీ ఇస్మాయిల్

అక్కిరెడ్డిపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. అండర్ –14, 17 విభాగాల్లో నిర్వహించిన ఖోఖో పోటీల్లో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. అండర్–17 షటిల్ బ్యాడ్మింటన్‌లో విజేతలుగా నిలిచారు. అండర్–17 అథ్లెటిక్స్‌లో ఈ పాఠశాల విద్యార్థిని సాయిశ్రీ 100, 200 మీటర్ల ఈవెంట్స్‌లో ప్రథమ స్థానం గెలుచుకుంది. 800 మీటర్ల విభాగంలో ఎం.చంద్రకళ, ఎం.రాజు 3వ స్థానంలో నిలిచారు. లాంగ్ జంప్‌లో బి.హేమలత, సాయి శ్రీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అండర్–14 విభాగంలో 200 మీటర్ల విభాగంలో బి.సంజన 3వ స్థానంలో, 600 మీటర్ల విభాగంలో ఆర్.ఢిల్లేశ్వరి ద్వితీయ స్థానంలో నిలిచారని పాఠశాల పీడీ మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. విజేతలను హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు అభినందించారు.

యువకుడి అదృశ్యం


మణికంఠవర్మ (ఫైల్)

కూర్మన్నపాలెం: తమ కుమారుడు కనిపించడం లేదంటూ దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేశారు. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం వడిలేరు గ్రామానికి చెందిన చుక్కన ఆదర్శ మణికంఠవర్మ పరవాడ ఫార్మాసిటీలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నా డు. ఈ నెల 8వ తేదీ నుంచి మణికంఠవర్మకు అతని తల్లి నందీశ్వరి ఫోన్ చేస్తున్నా ఎటువంటి సమాధానం లేకపోవడంతో ఆమె ఆందోళన చెందారు. వడిలేరు గ్రామం నుంచి వచ్చి అగనంపూడి పరిసర ప్రాంతాల్లో వెతకగా ఎటువంటి సమాచారం లభించకపోవడంతో దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఆన్‌లైన్‌లో స్టీల్‌ప్లాంట్ క్వార్టర్ల ఎలాట్‌మెంట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఉద్యోగులకు క్వార్టర్ల ఎలాట్‌మెంట్‌కు ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టింది. ఈ మేరకు టౌన్ అడ్మిన్ జీఎం వై. చంద్రశేఖర్ శుక్రవారం సర్క్యులర్ విడుదల చేశారు. ఇకపై క్వార్టర్ల కోసం ఉద్యోగులు దరఖాస్తులను పట్టుకుని విభాగానికి వెళ్లకుండా కార్యాలయంలో ఉండే ఇంట్రానెట్ పోర్టల్‌లోని ఈపీఎస్ఎస్‌లో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని తెలియజేశారు. ఎలాట్‌మెంట్ ఆర్డర్‌ను కూడా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు


శీలానగర్‌లోని ఓ షాపులో పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న జెడ్సీ సింహాచలం

అక్కిరెడ్డిపాలెం: పాలిథిన్ కవర్లు, నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం హెచ్చరించారు. 69వ వార్డు శీలానగర్, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లోని స్వీట్ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, కిరాణా షాపుల్లో శుక్రవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల్లో పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుని, జరిమానా విధించారు. ప్లాస్టిక్ నిషేధంపై ఎన్నిమార్లు హెచ్చరిస్తున్నా వ్యాపారుల్లో మార్పు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే తీరు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్, వార్డు సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం


స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు

కూర్మన్నపాలెం: పరిసరాల శుభ్రతతో వ్యాధులను నియంత్రించవచ్చని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు అన్నారు. 87వ వార్డు ఎరుకులవీధి సచివాలయ పరిధిలో ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ్, డ్రైడే–ఫ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను అగ్రగామిగా నిలపాలని కోరారు. జోనల్ కమిషనర్ సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కె.శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే రెండు నెలల జీతం చెల్లించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆస్పత్రి వద్ద శుక్రవారం ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ అప్‌కీప్ మెయింటెనెన్స్‌లో పని చేస్తున్న కార్మికులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.వి.రమణ, బి.గంగరాజు, అమ్మిరెడ్డి, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

పార్కులో స్వచ్ఛభారత్

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు ఉడాఫేజ్–1లో ఉన్న పార్కును స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పార్కు అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం శుభ్రపరిచారు. రానున్న వినాయక చవితిని దృష్టిలో పెట్టుకుని పార్కులో పెరిగిపోయిన మొక్కలను తొలగించి, వాకింగ్ ట్రాక్‌ను శుభ్రపరిచారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పార్కుకు వచ్చిన వారికి సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వరహాల బాబు, కార్యదర్శి పి.ఆర్.ఖాన్, కోశాధికారి బీవీఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లకు ఆదర్శం 'మోక్షగుండం'


ఆటోనగర్ పార్కులో విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పారిశ్రామిక వేత్తలు


స్టీల్‌ప్లాంట్‌లో విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉన్నతాధికారులు

అక్కిరెడ్డిపాలెం: నేటితరం ఇంజినీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని ఐలా చైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి కోరారు. ఆయన విజ్ఞానం, నైపుణ్యం నిరుపమానమని కొనియాడారు. మోక్షగుండం జయంతిని పురస్కరించుకుని ఆటోనగర్ ఐలా భవనం ఎదురుగా గల విశ్వేశ్వరయ్య పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐలా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ పారిశ్రామిక వేత్తలు ఏ.కె.బాలాజీ, కొండపల్లి శ్రీనివాస రెడ్డిలను ఆటోనగర్ పారిశ్రామిక వేత్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి రామకృష్ణం రాజు, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి పర్చూరి ప్రభాకర్, పెదగంట్యాడ ఐలా అధ్యక్షుడు సత్యనారాయణ, పారిశ్రామిక వేత్తలు శేషగిరిరావు, కృష్ణప్రసాద్, వై.సాంబశివరావు, హనుమంతయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టిన రోజు సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఎన్.వి. స్వామి విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విశ్వేశ్వరయ్య మైసూరులోని కృష్ణరాజు సాగర డామ్ నిర్మాణంలో, హైదరాబాద్‌లో వరద నివారణ చర్యల్లో చీఫ్ ఇంజినీర్‌గా పని చేసి వాటి కోసం ఎనలేని కృషి చేసి దేశంలోని ఇంజినీర్లకు ప్రేరణగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సీజీఎంలు యు. శ్రీధర్, సోట్టీ, ప్రవీణ్ కుమార్, రంజన్ మొహంతి, హెచ్‌ఆర్ జీఎం బినయ్ ప్రసాద్, జీఎం డాక్టర్ జి. రమాదేవి, వర్క్స్ అడ్మిన్ అధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం


మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న నరసింగరావు

పెదగంట్యాడ: పర్యావరణ హితమైన మట్టి గణపతినే పూజిద్దామని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు జిలకర్ర రమణ, భువనేశ్వరి ఆధ్వర్యంలో బర్మా కాలనీలో మట్టి గణపతి ప్రతిమలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సన్యాసిరావు, మంగమ్మ, రాజశేఖర్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం


అనూప్‌కుమార్ సత్పతిని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్ మరింత అభివృద్ధి చెందుతుందని వాల్తేరు పూర్వ డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి అన్నారు. సీపీటీఎంగా పదోన్నతిపై కోల్‌కతా వెళ్తున్న సత్పతిని దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక రూపొందించడం జరిగిందని, భవిష్యత్తులో స్థానికులు అనుకున్నది సాకారమవుతుందన్నారు. కార్యక్రమంలో దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కె.ఈశ్వర్, వి.జాషువా, కె.వీర్రాజు, ఎం.ఎస్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నపాలెంలో అన్న సమారాధన


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా 75వ వార్డు అయ్యన్నపాలెం గ్రామంలో శ్రీకృష్ణ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్, వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు మొల్లి ఆనంద్, ఉరుకూటి అప్పారావు, బుల్లెట్ రెడ్డి, అప్పలస్వామి, పెంటయ్య, రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు


పోటాపోటీగా వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పరవాడ మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు రెండు విభాగాల్లో, 9 క్రీడా అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండో రోజు క్రీడా పోటీలను లంకెలపాలెం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలోని 14 పాఠశాలల విద్యార్థులు వారి క్రీడా ప్రతిభను ప్రదర్శించారన్నారు. విజేతలు డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్రిక్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో నియోజకవర్గంలో ఆడనున్న జట్లను ఎంపిక చేసినట్టు చెప్పారు. శుక్రవారం వాలీబాల్, కబడ్డీ అండర్–17, త్రోబాల్ అండర్–14తో పాటు యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరాహోరీగా స్కూల్ గేమ్స్

గాజువాక : గాజువాక మండల పరిధిలోని పాఠశాలలకు చెందిన బాల బాలికలకు వివిధ ఆటల పోటీలు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం హోరాహోరీగా సాగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన జంప్స్, త్రోస్, రన్స్ క్రీడా పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి ప్రారంభించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు త్వరలో నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు పి.వెంకటరత్నం, మనోజ్, రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.